సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



సోమశిలలో 19.796 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 19.796 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,150
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,402
3 శాతం జీఎస్టీతో	రూ.5,564
సవర (8 గ్రాములు)	రూ.44,512

గరిష్టం/కనిష్టం
37.0 /28.5

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 48 శాతం ఉంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వేడుకగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

- చినశేషవాహనం, గజవాహనంపై విహరించిన స్వామివారు



వెంకటాచలం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గొలగమూడిలో వెలసిన భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉదయం ఆలయంలో వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజల అనంతరం చినశేషవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. ఆశ్రమం చుట్టూ ఊరేగింపు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్‌పై స్వామివారిని ఆశీనులను చేసి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. వెంకయ్యస్వామి ఆశ్రమ భజన బృందం ప్రదర్శించిన కోలాటం, ఓంనారాయణ.. ఆదినారాయణ అంటూ ఆలపించిన స్వామి పాటలు భక్తిపారవశ్యాన్ని నింపాయి. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేసి గొలగమూడిలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అశ్వవాహనసేవ, రాత్రి పెదశేషవాహనసేవ నిర్వహించనున్నారు.

24 లోపు అవార్డులకు ప్రతిపాదనలు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఈ నెల 24వ తేదీ లోపు వారి ప్రతిపాదనలను డిప్యూటీ ఈఓలు, ఎంఈఓల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఎంఈఓ, డిప్యూటీ ఈఓలను సంప్రదించవచ్చని, అలాగే www. deonellore.50 webs. com వెబ్‌సైట్‌ను చూడవచ్చని తెలిపారు.

30న ఐటీఐ మూడో విడత కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ కాని సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 30న ప్రభుత్వ ఐటీఐలు, 31న ప్రైవేట్ ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని, 28వ తేదీ లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకునేందుకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

ఆలిండియా హాకీ టోర్నీకి నెల్లూరీయులు



ఎంపికైన హాకీ క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆలిండియా విద్యుత్ ఉద్యోగుల హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు నలుగురు నెల్లూరీయులు ఎంపికయ్యారు. అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్.సుబ్రహ్మణ్యం, గ్రేడ్–2 జేఎల్‌ఎం జి.పెంచలయ్య, రికార్డు అసిస్టెంట్ ఎన్.నవీన్‌కుమార్, లైన్‌మెన్ వి.నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ పోటీలు కాకినాడలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యుత్ ఉద్యోగుల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రజట్టుకు నలుగురు నెల్లూరీయులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ వైపే జనం

రాపూరు: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం, గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో జనమంతా వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారని ఆ పార్టీ నేతలు అన్నారు. రాపూరు మండలంలో జరిగిన వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించడంతో సోమవారం ఎంపీపీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాపూరు మండలం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని పేర్కొన్నారు.

చిట్టి చేతులు సరికొత్త ఆవిష్కరణలు

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు అవకాశం కలుగుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించేలా ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నారు. చిట్టి చేతులతో సరికొత్త ఆవిష్కరణలు సృష్టిస్తున్న విద్యార్థులకు అవార్డులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.



జిల్లాస్థాయి ప్రదర్శనలో ప్రాజెక్ట్‌లను వీక్షిస్తున్న ఆర్జేడీ సాయిసుబ్బారావు (ఫైల్)

విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెట్టేలా ఇన్‌స్పైర్ మనక్

- 2023–24 ఏడాదికి ప్రతిపాదనలు
- ఈ నెల 31వ తేదీ వరకు గడువు
- 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవకాశం
- యూపీకి 3, హైస్కూల్‌కు 5 ప్రాజెక్ట్ నమూనాలు
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రోత్సాహకాలు

జిల్లాలో..

ప్రాథమికోన్నత పాఠశాలలు	-443
3 నుంచి 10వ తరగతి వరకు ఉన్న స్కూళ్లు	-275
6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న స్కూళ్లు	-366
విద్యార్థుల సంఖ్య - 1.48 లక్షల మందికి పైగా..	

నెల్లూరు(టౌన్): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇన్‌స్పైర్ మనక్ నిర్వహిస్తూ వారిలో పరిశోధనాశక్తిని పెంపొందించేలా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్‌కు 2023–24 ఏడాదికి జాతీయస్థాయిలో లక్ష మంది విద్యార్థులను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేసేందుకు విద్యార్థులకు కొంత మొత్తాన్ని అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులు

ఇన్‌స్పైర్ మనక్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్ట్ నమూనాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంపాల్సిఉంది. జిల్లాస్థాయిలో ప్రాజెక్టుకు రూ.10 వేలు, రాష్ట్రస్థాయి ప్రాజెక్టుకు రూ.20 వేలు, జాతీయస్థాయి ప్రాజెక్టుకు రూ.50 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనలో ఎంపికైతే రాష్ట్రస్థాయికి, అక్కడ ఎంపికైతే జాతీయస్థాయికి, ఆ తరువాత అంతర్జాతీయస్థాయిలో ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శిస్తారు. వాటిలో ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులు అందజేస్తూ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారు.

ప్రాజెక్ట్ వివరాల నమోదు

ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తుల గడువును ఈ నెల 31వ తేదీ వరకు నిర్ణయించారు. ప్రతి పాఠశాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాల్సిఉంది. పాఠశాల అథారిటీ ఐచ్ఛికాన్ని క్లిక్ చేసి వన్‌టైం రిజిస్ట్రేషన్ ద్వారా వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. జిల్లా విద్యాశాఖ ఆమోదించాక ఈ–మెయిల్, యూజర్ ఐడీతో లింక్ వస్తుంది. అందులో పాస్‌వర్డ్ నమోదు చేయాలి. అనంతరం ప్రాజెక్ట్ నమూనాకు సంబంధించి పూర్తి వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. దీంతోపాటు ప్రతి విద్యార్థి బ్యాంక్ ఖాతా, తండ్రి లేదా తల్లికి సంబంధించిన బ్యాంక్ ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలు, విద్యార్థుల పేర్లు, వారి తల్లిదండ్రులు పేర్లు, పుట్టినతేదీ, ఆధార్‌కార్డు నంబర్, పాఠశాల యూడైస్ కోడ్, ఈ–మెయిల్, చిరునామా, గైడ్ టీచర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సెల్‌ఫోన్ నంబర్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఎలాంటి ప్రాజెక్ట్ నమూనాలు ప్రదర్శించాలంటే..

సమాజానికి ఉపయోగపడే శాస్త్రీయ ఆలోచనలు, ఇంటికి సంబంధించిన, రైతులు, కూలీల సమస్యలు, దైనందిన అవసరాలు.. ఇలా ఏదైనా విద్యార్థి దానికి సహజమైన, సృజనాత్మక, ఆధునిక పద్ధతిలో ప్రాజెక్టులు రూపొందించి తగిన పరిష్కారం చూపించాల్సి ఉంటుంది. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులను రూపొందించాల్సి ఉంది.



2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి అంతర్జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్ (ఫైల్)

ప్రతి ప్రాజెక్ట్‌కు రూ.10 వేలు

జిల్లాస్థాయిలో ప్రతి పాజెక్టుకు రూ.10 వేల చొప్పున బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తారు. దీనిని సద్వినియోగం చేసుకుని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించాలి. ప్రభుత్వం సూచించిన అంశాలకు అనుగుణంగా ప్రాజెక్టులను తయారు చేయాల్సి ఉంది.

– శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి

ఏ పాఠశాలకూ మినహాయింపు లేదు

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లను ప్రతి పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా పంపాలి. ఏ పాఠశాలకూ మినహాయింపు లేదు. యూపీ స్కూల్ నుంచి 3, హైస్కూల్ నుంచి 5 ప్రాజెక్టులను పంపాలి. విద్యార్థులు విభిన్నంగా, శాస్త్రీయ ఆలోచనలకు అనుగుణంగా ప్రాజెక్టులను రూపొందించాలి.

– గంగాభవాని, డీఈఓ

మీకు లబ్ధి చేకూరితేనే ఆదరించండి



చెక్కులు అందుకున్న గిరిజన లబ్ధిదారులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధి చేకూరి ఉంటేనే 2024 ఎన్నికల్లో తమ పార్టీని మళ్లీ ఆదరించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీలో పక్కాగృహాలు నిర్మించుకొనే గిరిజన లబ్ధిదారులు 142 మందికి రూ.15,000 చొప్పున సోమవారం మంత్రి చేతులమీదుగా చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ సంక్షేమ–అభివృద్ధి పథకాల అమలులో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్, బీజేపీ, ఇతర పార్టీల నేతలందరూ కలిపి పోరాటం చేస్తున్నారని, దీనిని బట్టి చూస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఎంత బలంగా ఉందనేది స్పష్టమవుతోందని తెలిపారు.

12 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం

సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 12 వార్డుల్లో ఘన విజయం సాధించారని మంత్రి కాకాణి తెలిపారు. టీడీపీకి 9 వార్డుల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరకలేదన్నారు. మరో 3 వార్డుల్లో పోటీ చేసిన టీడీపీ మద్దతుదారులు చిత్తుగా ఓడిపోయారని తెలిపారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో రైతులు తెలిపిన వివిధ సమస్యలను సావధానంగా మంత్రి ఆలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, సర్పంచ్‌లు ఎం.జనార్దన్‌రెడ్డి, బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, ముత్యంగౌడ్, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు.



అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువు లోపు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ పద్మావతి, జెడ్పీ సీఈఓ చిరంజీవిలతో కలిసి కలెక్టర్ స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అత్యవసరమైన అర్జీలపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ వస్తుంటే దరఖాస్తుదారుడి వద్దకు వెళ్లి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా నేతలు, బీసీ విద్యార్థి ఫెడరేషన్ నేతలు, బీజేపీ నమామి గంగే నేతలు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, నాగరాజు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పల్లెవాసులకూ ఇంటి ఆస్తి హక్కు

- గ్రామాల్లోని స్థలాలకు హక్కు పత్రాలు
- స్వమిత్వ పథకం ద్వారా అందించేలా చర్యలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు

గ్రామాల్లో తరతరాలుగా హక్కు పత్రాలు లేని స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ పత్రాలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. స్వమిత్వ పథకం ద్వారా గ్రామాల్లోని స్థలాలను రీ సర్వే చేసి హద్దులు నమోదు చేసి హక్కు పత్రాలను అందించనున్నారు. ఈ ప్రక్రియను జిల్లాలోని పలు గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్నారు.

కావలి: మారుతున్న కాలానికనుగుణంగా కుగ్రామాల్లో కూడా ప్రజల జీవనశైలిలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గ్రామాల్లోని ప్రజలకు కూడా విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతుండడంతో ఆర్థికంగా పురోగతిని సాధిస్తున్నారు. దీంతో గ్రామాల్లో కూడా పోటీపడి ఖరీదైన భవనాలు నిర్మిస్తున్నారు. అయితే పూర్వం నుంచి గ్రామాల్లోని నివాస స్థలాలకు చట్టప్రకారం నిర్దిష్టమైన డాక్యుమెంట్లు ఉండేవి కావు. కేవలం నోటిమాట ద్వారానే స్థలాల యాజమాన్యం మారుతుండేది. ఇంటి స్థలానికి సంబంధించిన యాజమాన్య హక్కులు తరతరాలుగా లేకపోవడంతో ఆర్థిక అవసరాల కోసం తమ ఇంటిని తాకట్టు పెట్టి రుణం పొందడానికి అవకాశం ఉండేది కాదు. దీంతో గ్రామాల్లోని ప్రజలు పట్టణాల్లో లాగా తమ ఇల్లు ఆర్థిక అవసరాలకు ఉపయోగపడడం లేదనే ఆవేదన చెందేవారు. అలాగే గ్రామకంఠాల్లో ఉన్న ఇళ్లు, పశువుల కొట్టాలు, గడ్డివాములు తదితర వాటికి గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి హక్కు ప్రతాలు ఉండేవి కావు. ఈ సునిశితమైన అంశాన్ని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టింది. కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ లు సంయుక్తంగా స్వమిత్వ పథకాన్ని అమలు చేస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలకు సంబంధించిన నివాసాలకు యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. దీని వల్ల తమ బిడ్డల పెళ్లి కోసమో, చదువుల కోసమో, ఇతరత్రా ఆర్థిక అవసరాల కోసమో బ్యాంకుల్లో ఈ పత్రాలను తనాఖా పెట్టి రుణం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.



ఆత్మకూరు మండలంలో రీ సర్వేలో భాగంగా స్థలాల వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

ఎలా అమలు పరుస్తున్నారంటే..

జిల్లాలో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను ఖరారు చేస్తూ రూపొందించిన కార్డులను పంపిణీ చేయడానికి ఉద్దేశించిన స్వమిత్వ (SVAMITVA – సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. డ్రోన్ సర్వే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గ్రామాల్లోని ఇళ్లను సర్వే చేసి ప్రజలకు రికార్డ్ ఆఫ్ రైట్స్ కార్డులు మంజూరు చేస్తారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి హక్కులపై స్పష్టత ఇస్తారు. అలాగే పన్ను వసూళ్ల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయ వనరులను సమకూర్చుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఉపయోగం ఎలాగంటే...

'ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల ఇంటికి సంబంధించి డాక్యుమెంట్లు ఏవి అవసరమున్నా ఆన్‌లైన్ ద్వారా తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇంటి విలువ ఆధారంగా బ్యాంకు రుణం పొందడానికి వీలవుతుంది. ఏ అవసరం ఉన్నా మీసేవ ద్వారా ఇంటికి, ప్లాటుకు సంబంధించిన వివరాలన్నీ పొందవచ్చు. ఇంటింటి సర్వేలో మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొంటారు. వివరాల సేకరణ పూర్తయిన తరువాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. జిల్లాలో 722 గ్రామ పంచాయతీల్లో స్వమిత్వ పథకం ద్వారా రీ సర్వే అమలు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటికే 94 గ్రామాల్లో ఇంటింటి సర్వే పూర్తి చేశారు. యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రాపర్టీ కార్డులు, ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్‌లు తయారు చేసి 32 గ్రామాల్లో పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. బోగోలు, బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి, జలదంకి, ఏఎస్‌పేట, నెల్లూరురూరల్, పొదలకూరు, రాపూరు మండలాల్లో రెండేసి గ్రామాల్లో, కలిగిరి, కావలిరూరల్, సంగం, వింజమూరు, అనంతసాగరం, ఆత్మకూరురూరల్, చేజర్ల మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో, ఇందుకూరుపేట మండలంలో 3 గ్రామాల్లో, వెంకటాచలం మండలంలోని 6 గ్రామాల్లో ఈ స్వమిత్వ పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు	- 722
ఇంటింటి సర్వే పూర్తయిన గ్రామాలు	- 94

పక్కాగా వివరాల నమోదు

స్వమిత్వ పథకం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో స్థలం ఫొటోలు తీస్తారు. ఇళ్లు, ఇంటి చుట్టుపక్కల ఖాళీ స్థలం కొలతలు తీసుకుంటారు. ఇంటి యజమాని పేరు, వివరాలు సేకరిస్తారు. ఇరుగుపొరుగు వారి పేర్లతో హద్దులు నమోదు చేస్తారు. రోడ్డు ఉంటే ఆ వివరాలు పొందుపరుస్తారు. ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలను కొలుస్తారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని వివరాలను పక్కాగా నమోదు చేసుకుంటారు. సేకరించిన వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

జిల్లాలోని గ్రామాల్లో ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లకు అవసరమైన ప్రాథమిక సర్వే కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ అనంతరం ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ఆదేశాలు వచ్చే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

– సుస్మిత, జిల్లా పంచాయతీ అధికారిణి

క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.5 లక్షల విరాళం



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న దాత నాతా సుధాకర్‌రావు–విజయ దంపతులు

నెల్లూరు(బారకాసు):ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డులో నిర్వహిస్తున్న క్యాన్సర్ హాస్పిటల్‌కు నగరానికి చెందిన నాతా సుధాకర్‌రావు –విజయ దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో ఆ దంపతులు కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు రూ.5 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణంలో ఓ గది నిర్మాణానికి అవసరమైన నగదును తమవంతుగా అందజేసినట్లు తెలిపారు. నిర్మించే గదికి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాతా సీతారామయ్య – రోశమ్మ పేర్లను ఏర్పాటు చేయాలని దాత సీతారామయ్య ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, రంగయ్యనాయుడు, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ హాజరవుతారని, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు సోమవారం తెలిపారు. సీఎమ్మార్ ఎకో అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్, మహేంద్ర కంపెనీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లోని సెక్యూరిటీగార్డ్స్, టెక్నీషియన్స్, సేల్స్‌ఎగ్జిక్యూటీవ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీఐ(ఫిట్టర్, ఎలక్ట్రీషియన్), ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమో, బీటెక్ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కరించాలి

నెల్లూరు (క్రైమ్): స్పందన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పోలీస్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 103 మంది హాజరయ్యారు. తమ సమస్యలను వినతుల రూపంలో పోలీస్ అధికారులకు అందజేశారు. వాటిని పరిశీలించిన అధికారులు సంబంధిత సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, చీటింగ్, ఉద్యోగం పేరిట మోసాలు, ప్రేమ పేరుతో వంచన, అదృశ్యం, దొంగతనం రికవరీల్లో జాప్యం, తదితరాలపై వినతులు అందాయి. ఎస్పీ, ఎస్బీ,సెల్, డీటీసీ, దిశ, డీఎస్పీలు శ్రీనివాసరావు, శిరీష, సురేష్‌బాబు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

వెంకటాచలం: నివాసాల మధ్యనున్న చెట్టు తొలగించే విషయంలో నెలకొన్న వివాదంలో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన మండలంలోని గుడ్లూరువారిపాళెంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..గుడ్లూరువారిపాళేనికి చెందిన ఏపూరు రవి, జనార్దన్ నడుమ ఇళ్ల మధ్యనున్న చెట్టు తొలగించే విషయమై ఆదివారం గొడవ నెలకొంది. ఈ క్రమంలో ఏపూరు రవిపై జనార్దన్, అతని కుటుంబ సభ్యులు జయంతి, రాజా మరికొందరు కలిసి మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల వారు గమనించి అక్కడికి చేరుకోవడంతో పరారయ్యాడు. సోమవారం బాధితుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	: రూ.134
లేయర్ లైవ్	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.232
స్కిన్‌లెస్ చికెన్	: రూ.258
లేయర్ చికెన్	: రూ.178



నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ.7

ప్రజల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ వారికి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ వ్యవస్థలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడంతో పాటు సంక్షేమ పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపాయని తెలిపారు. నాలుగేళ్ల పాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేయని వారికి కూడా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. పేదల కష్టాలను గుర్తించి తండ్రి దివంగత సీఎం వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ ఆదర్శవంతమైన పాలన చేపడుతున్నారన్నారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలో 80 సచివాలయాల పరిధిలో సుమారు 95,385 ఇళ్లను సందర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్‌చైర్మన్ షాహుల్, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, మల్లారెడ్డి, యానాదిరెడ్డి, జయంతి, అనంతమ్మ, శ్రీదేవి, షకీలాబేగం, రహమత్, నస్రీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలోని తేడాను గమనించండి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని అన్ని ప్రజావ్యవస్థలను నిర్వీర్యం చేసిన చంద్రబాబు పాలనకు, నేడు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వాటిని బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని తేడాను ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కావలి మండలం గౌరవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజలు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పాలనతో సీఎం వైఎస్ జగన్ దేశ వ్యాప్తంగా అభినందనలు అందుకుంటున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు పాఠశాలలు, ఆస్పత్రులను నిర్వీర్యం చేసి పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేశారని తెలిపారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, వైద్యశాలలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. గతంలో చంద్రబాబు ఆర్టీసీని నష్టాల బాట పట్టించడమే కాకుండా 54 ప్రభుత్వ రంగ సంస్థలను తన తాబేదారులకు కట్టబెట్టి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలను ఏర్పాటు చేసి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, జగనన్న ప్రభుత్వాల పనితీరును ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వినూత్నంగా పాలన చేస్తున్న జగనన్న మీద కడుపుమంటతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుసంస్కారపు భాషతో మాట్లాడుతున్నారన్నారు. ఎల్లో మీడియా జర్నలిజం ముసుగులో నిత్యం నీచమైన రాతలతో జగనన్నపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వీరికి రాష్ట్రం, ప్రజలపై ప్రేమ లేదన్నారు. వారు చేసే రాజకీయ విమర్శలు, నిందలను పట్టించుకోవద్దని, కట్టుకథలు, రెచ్చగొట్టే మాటలు నమ్మొద్దని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ఆలూరు కొండమ్మ, డీసీసీబీ డైరెక్టర్ చింతం తిరుములారాణి, ఎంపీటీసీ చింతం రమణమ్మ, సర్పంచ్ దేవరపల్లి రాధిక, ఉపసర్పంచ్ సురే శ్రీలత, నాయకులు కున్నం వెంకట్రామిరెడ్డి, బాబుల్‌రెడ్డి, పలకా శ్రీధర్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మై బీఎస్ఎన్ఎల్‌తో మరింత చేరువ

నెల్లూరు(మినీబైపాస్): ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిఘమ్ లిమిటెడ్ సరికొత్త టెక్నాలజీతో వినియోగదారులకు చేరువవుతోంది. టెలికాం రంగంలోకి ఎన్నో ప్రైవేట్ సంస్థలు వచ్చినా..బీఎస్ఎన్ఎల్‌ను మాత్రం వినియోగదారులు తమ సొంత సంస్థగా భావిస్తుంటారు. ప్రైవేట్ టెలికాం సంస్థలు మారుమూల గ్రామాలకు సేవలను విస్తరించలేకపోతున్నాయి. అదే తరుణంలో బీఎస్ఎన్ఎల్ ప్రతి ప్రాంతానికి చేరువవడంతో సంస్థ మనుగడ సాగిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ సైతం సాంకేతిక టెక్నాలజీ వైపు ముందడుగు వేసి 'మై బీఎస్ఎన్ఎల్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా సేవలను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో మై బీఎస్ఎన్ఎల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ–మెయిల్ ఐడీ లేదా రిజిష్టర్ మొబైల్ నంబరుతో యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి. అనంతరం మన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

యాప్ ద్వారా పొందే సర్వీసులు

బిల్ పేమెంట్ : ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ బిల్లులు చెల్లించాలంటే క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి. ఇప్పుడు బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ల్యాండ్ ఫోన్, మొబైల్ పోస్ట్ పెయిడ్, ఇంటర్నెట్ బిల్లులను యాప్ ద్వారా నిమిషాల్లో చెల్లించవచ్చు.

రీచార్జ్ : బీఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ మొబైల్‌కు యాప్ ద్వారా రీచార్జి చేసుకోవచ్చు

ఫ్యాన్సీ నంబర్ల ఎంపిక : మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా దేశం మొత్తం మీద అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలను తెలుసుకోవచ్చు. తద్వారా మనకు కావాల్సిన నంబరును మనం సొంతం చేసుకోవచ్చు. బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్‌ను ఎంపిక చేసుకుని మన మొబైల్ నంబరు ఇస్తే ఎస్ఎంఎస్ ద్వారా పిన్ నంబరు వస్తుంది. ఆ నంబరు మనకు 40 గంటల పాటు రిజర్వు చేయబడుతుంది. ఆ లోగా స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లి నంబర్‌ను మనం సొంతం చేసుకోవచ్చు.

యూసేజ్ రిపోర్ట్ : యాప్‌లో మన ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, మొబైల్, సీడీఎంఏకు చెందిన ప్రతిరోజూ వినియోగాన్ని పొందవచ్చు.

హిస్టరీ: బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్, మొబైల్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్, బ్రాడ్‌బ్యాండ్‌కు సంబంధించిన హిస్టరీని యాప్‌లోని హిస్టరీ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రైవేట్ టెలీకమ్యూనికేషన్లకు దీటుగా...

ప్రైవేట్ టెలీకమ్యూనికేషన్లకు దీటుగా సర్వీసును భారత్ సంచార్ నిఘమ్ లిమిటెడ్ అందిస్తోంది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 'మై బిఎస్ఎన్ఎల్ యాప్' ద్వారా వినియోగదారులు బిల్లుల చెల్లింపులను ఇంటి వద్ద నుంచి సులభంగా పే చేయవచ్చు. ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చే ఆఫర్లను తెలుసుకోవచ్చు. కొత్తగా వచ్చిన టెక్నాలజీని వినియోగదారుడికి అందుబాటులోకి తెచ్చాం..

–ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్

స్పెషల్ ఆఫర్లు: బీఎస్ఎన్ఎల్ కు చెందిన ప్రత్యేక ఆఫర్ల వివరాలను యాప్‌లో పొందవచ్చు.

ఫిర్యాదులు: బీఎస్ఎన్ఎల్‌కు సేవలకు సంబంధించి ఫిర్యాదులను వినియోగదారులు యాప్‌లోని కంప్లయింట్ అనే ఆప్షన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చు. తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

- కొత్త ల్యాండ్‌లైన్, ఇంటర్నెట్ కనెక్షన్లను యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

బీఎస్ఎన్ఎల్ ఉచిత 4జీ సేవలు

నెల్లూరు(మినీబైపాస్): జిల్లాలో భారత్ సంచార్ నిఘమ్ లిమిటెడ్ 4జీ సేవలను త్వరలో ప్రారంభించనున్నామని డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2జీ, 3జీ సిమ్‌లు కలిగిన వినియోగదారులకు సెప్టెంబరు 30 వరకు ఉచితంగా 4జీ సిమ్‌లను అందజేస్తున్నామని చెప్పారు. సమీపంలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రంలో సంప్రదించి సిమ్‌లు మార్చుకోవాలని కోరారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

నిత్యం ఏదోక చోట ప్రమాదాలు చోటు చేసుకుని ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం చూస్తూనే ఉంటాం. అందులో ఎక్కువగా ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులే అధికం. అయినా ఆటోవాలాలు 15 మందికి పైగా ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదకరంగా వాహనాలను నడుపుతున్నారు. అధిక లోడు ప్రమాదమని తెలిసినా ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు నగరంలో తరచూ ఇలాంటి ఘటనలు కంటికి కనిపించినా రవాణా, పోలీసు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాపర్, నెల్లూరు



ప్రయాణికులను వెనుక కూర్చోబెట్టుకుని వెళ్తున్న ఆటోవాలాలు



ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న దృశ్యం



డ్రైవర్ సీట్‌లో విద్యార్థులను కూర్చోబెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యం

రూ.150 కోట్లతో డివిజన్లలో అభివృద్ధి పనులు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్లలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 29వ డివిజన్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రెయిన్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 29వ డివిజన్‌లో ఇప్పటికే రూ.3.67 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి మరో రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఎనలేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతుంటే కొందరు టీడీపీ నాయకులు ఏమి చేయడం లేదని మాట్లాడడం సమంజసం కాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆదరణ నానాటికి పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. అనంతరం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్త అహ్మద్‌ను ఆయన ఇంటికి వెళ్లి ఎంపీ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సత్తార్, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య కార్పొరేటర్లు అవినాష్, మొబీనా, శ్రీనివాసులురెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాయకులు సూరిబాబు, కోటేశ్వరరెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నేడు అన్నమాచార్య జాతీయ సాహితీ సదస్సు

గూడూరురూరల్: పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో తాళ్లపాక అన్నమాచార్య సాహితీ సదస్సును మంగళవారం నిర్వహించనున్నట్లు కళాశాల కమిటీ సభ్యుడు సీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల(డీఆర్ డబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో సాహితీవేత్తలు, వక్తలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం అన్నమాచార్య సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు వై విద్యాసాగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల కమిటీ సభ్యుడు జనార్దన్‌రెడ్డి